క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల సబ్ స్టేషన్‌లో ఆదివారం మెయింటెన్స్ పనులు, 33 కేవీ లైన్ కింద చెట్లు తొలగిస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్ ఇంజినీర్ సురేష్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు కరెంట్‌ను ఉండదని, వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

బాలల హక్కులపై అవగాహన



గోపాల్‌పేట: బాలబాలికలు వారి హక్కులపై అవగాహన పెంచుకోవాలని బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ లక్ష్మమ్మ అన్నారు. శనివారం ఆమె మండలంలోని తాడిపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో బాలబాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికల మధ్య లింగ వ్యత్యాసం లేకుండా అందరినీ చదివించాలని, బాలికలపై నేరాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. పోక్సో యాక్ట్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఆత్మకూర్: మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా రాణించాలని ఏపీఎం వెంకట్ అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని స్వయం సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. మండలానికి 45 పాడి పశువుల యూనిట్లు, పెరటి తోటలు, కోళ్ల పెంపకం 100 యూనిట్లు మంజూరయ్యాయని అర్హులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నిర్వాహకులు మహేశ్వరి, సునీత, ఉమాదేవి, సీసీలు అన్వర్‌పాష, ఆంజనేయులు, వీఓలు పాల్గొన్నారు.

గోపాల్‌పేట పాఠశాలది ఘన చరిత్ర

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడ చదువుకున్న వారు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా 38ఏళ్ల పాటు పనిచేసిన పరమేశ్వరాచారి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులతో పాటు వృత్తివిద్య కూడా విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలనాథ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రానికి సమీపంలో 200 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన తిరుమలనాథ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని శనివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము వినతిపత్రం అందజేశారు. తిరుమలనాథుడి ఆలయానికి ప్రతీ ఏటా భక్తుల రద్దీ పెరుగుతుందని, తిరుమలయ్య గుట్ట ప్రాంతంలో తిరుమల తిరుపతిలో 7 కొండలు ఉన్నట్లుగానే ఇక్కడ కూడా 7 కొండలు ఉన్నాయన్నారు. తిరుమలయ్య గుట్ట అటవీ ప్రాంతంలో అత్యంత అరుదైన, విలువైన వృక్షజాతి ఔషధ మొక్కలు ఉన్నాయని, తిరుమలలో అత్యంత విలువైన సంజీవని మొక్క కూడా ఉన్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్విని, రాధా, కల్పన, కవిత, సూగురు లక్ష్మీ, రాయన్నసాగర్, రాము, విజయ్ సాగర్, అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పలు గ్రామాల హిందువులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ఐక్య వేదికను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం విశ్వ హిందూపరిషత్ మండల నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి హిందువులపై జరిగే భౌతికదాడులను ఎదుర్కొనేందుకు ఐక్య వేదిక పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, రఘుపతిరెడ్డి, శేఖర్, జనార్దన్, తిరుపతయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

- విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, ఏఎస్పీ రాందాసు తేజావత్
- సైన్స్‌తోనే భవిష్యత్తు



మాట్లాడుతున్న విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, చిత్రంలో ఏఎస్పీ రాందాస్‌తేజావత్

వనపర్తి టౌన్/పెబ్బేరు రూరల్: నిత్య జీవితంలో సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలుసుకోలేని స్థితిలో ఉన్నామని, సోషల్ మీడియాలో వచ్చే మూఢత్వాన్ని సైన్స్ అనుకుంటూ భ్రమ పడుతున్నామని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ అన్నారు. ఈ మేరకు శనివారం వైజ్ఞానిక స్పృహ అందరికీ అవసరమని జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో గ్రాడ్యుయేషన్ అసోసియేషన్, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, పరిశోధనల ద్వారా విశ్వాంతరాల రహస్యాలను ఛేదిస్తున్నామని, 350 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న విశ్వాన్ని ఫొటో తీసే విజ్ఞానాన్ని సంపాదించామని తెలిపారు. మరోవైపు మూర్ఖత్వంతో చేతబడుల పేరిట తోటి వాళ్ల ప్రాణాలు తీసే క్రూరత్వంలోకి వెళ్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ దేశంలో మాదక ద్రవ్యాలు అనేది అతిపెద్ద సమస్యగా పరిగణించాల్సిన అవసరం ఉందని.. యువత మత్తుకు బానిసై తమతో పాటు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఏఎస్పీ రాందాసు తేజావత్ అన్నారు. యువత మత్తుకు అలవాటుపడటంతో యవ్వనంలోనే జవసత్వాలు సన్నగిల్లి శారీరకంగా, మానసికంగా కుంగిపోతున్నారని వివరించారు. దేశంలో యువత అత్యధికంగా ఉండటంతో వారినే లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ మాఫియా చెలరేగిపోతుందని తెలిపారు. ఉన్నత వర్గాలకు చెందిన యువతను పెడదోవ పట్టించడమేగాక పాఠశాలలు, కళాశాల విద్యార్థులను మత్తుకు బానిసలు మార్చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యావంతులే ఎక్కువగా ఈ మత్తులో జోగుతున్నారనేది కాదనలేని వాస్తవమన్నారు. మత్తు పదార్థాల కొనుగోలుకు అవసరమైన డబ్బు కోసం బైక్‌లు, విలువైన ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్నారని వివరించారు. అనేక నేరాల్లో పట్టుబడిన యువత మత్తుకు బానిసైనవారేనని.. ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతుందని వివిధ అధ్యయనాలు తెలుపడం ఆందోళన కలిగిస్తున్న అంశమన్నారు. యువకులు తమ బాధ్యతలు తెలుసుకొని లక్ష్యాలు సాధించేందుకు ముందుకుసాగాలని, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త విజయ్, తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ సెక్రెటరీ భరత్, గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర ఇన్‌చార్జ్ సంతోష్, గంధం నాగరాజు, బంజారా విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ ఉన్నారు.

రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు



జీపీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: జీపీ రికార్డులను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా జీపీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీలో వచ్చిన నిధులు, ఖర్చులకు సంబంధించిన రికార్డులు, ఇంటి పన్నుల వసూలు తదితర రికార్డులు పక్కగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి కాలనీలు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. జీపీలకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శి నర్మద తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



మదనాపురంలో..



శాగాపూర్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఏఎన్‌ఎం సుమిత్ర

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు ఏఎన్‌ఎం సుమిత్ర తెలిపారు. ఈనెల 20వ తేదీన నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రోజు హాజరు కానీ, నివారణ మాత్రలను తీసుకొని విద్యార్థులను గుర్తించి వారికి మాత్రలు అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. నులిపురుగల వలన విద్యార్థుల్లో ఎదుగుదల కుంటుపడుతుందని, మానసిక వికాస లోపం, బరువు తగినంత లేకపోవడం, రక్తహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని, టాయిలెట్‌కు వెళ్లి వచ్చిన తర్వాత, ఆహారం తీసుకునే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మదన్‌మోహన్, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు శనివారం అల్బెండజోల్ మాత్రలను వైద్యులు ముజాఫర్, వార్డెన్ బెనర్జీ పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఈసీజన్‌లో విద్యార్థులు పరిశుభ్రత పాటించి, అంటు రోగాలతో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లేశం, సూపర్‌వైజర్ ప్రమీలమ్మ, ఆశాలు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

‘చేసిన అభివృద్ధి పనులు గుర్తుంటాయి’



మాట్లాడుతున్న ఎంపీపీ కమలేశ్వర్‌రావు

వీపనగండ్ల: ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసినా.. వారు చేసిన అభివృద్ధి పనులు స్థిరంగా నిలిచి పోతాయని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. జులై 4న పదవీ విరమణ చేయనున్న ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుడికి శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశానన్నారు. మండల కేంద్రానికి రావాల్సిన పోలీసు సర్కిల్ కార్యాలయం, జూనియర్ సబ్‌కోర్టు, ఎస్సీ గురుకుల పాఠశాల, డిగ్రీకళాశాల ఏర్పాటుతో పాటు అనేక అభివృద్ధి పనులపై తనవంతుగా ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ రవినారాయణ, జూనియర్ అసిస్టెంట్ అమీర్, జెడ్పీటీసీ మాధురి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం..

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి మంత్రి జూపల్లి సహకారంతో అంబులెన్స్ వసతి సమకూరిందని, అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు, పదోన్నతులు, నూతన ఉపాధ్యాయుల నియామకం ద్వారా భర్తీ కానున్నాయని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, జెడ్పీటీసీ మాధురి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1986–87 విద్యా సంవత్సరంలో పదో తరగతి కలిసి చదివిన మిత్రుడు అకాల మరణం చెందడంతో తోటి స్నేహితులు అందరూ కలిసి రూ.73వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. మండలంలోని ఆగారం గ్రామానికి చెందిన సిరాజ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాటి మిత్రులు రూ.73 వేలు జమ చేసి శనివారం ఆగారం గ్రామానికి వెళ్లి మిత్రుడి భార్య ఆసియాబేగానికి అందించారు. బాల్‌రెడ్డి, దేవిజానాయక్, లింగస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డుకు చెందిన మండ్ల ఈశ్వరమ్మ మృతి చెందిన విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ ఎమ్మెల్యే మేఘారెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే సూచన మేరకు శనివారం వైస్ చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నియోజకవర్గ సమన్వయకర్త సతీష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పంపిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేష్, వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, శంకరయ్య ఉన్నారు.

ఉపాధి కూలీకి పరామర్శ



గాయపడిన ఉపాధి కూలీ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఉపాధి పనులు చేస్తూ ఇటీవల గాయపడిన కూలీ తులసిని శనివారం ఎంపీడీఓ కోటేశ్వర్, ఏపీఓ కుర్మయ్య శనివారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం తండాలో జరుగుతున్న ఉపాధి పనికి వెళ్లిన తులసి అనారోగ్యంతో కారణంగా ఒక్కసారిగా బీపీ పెరగడంతో సొమ్మసిల్లి పడిపోవడంతో తలకు గాయమైంది. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి..

ఇటీవల తండాలో ఉపాధి పనులు చేస్తూ గాయపడిన ఉపాధి కూలీ తులపిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి, గిరిజన సంఘం నాయకులు బాల్యానాయక్ డిమాండ్ చేశారు. గాయపడిన ఉపాధి కూలీ తులసిని శనివారం ఆయన పరామర్శించారు.

బాధిత కుటుంబానికి..

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తంబళ్ల బ్రహ్మయ్య తల్లి అలివేలమ్మ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. శనివారం మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, రాముయాదవ్, సుదర్శన్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

‘వ్యక్తిపై కేసు నమోదు’

వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూర్: వాట్సాప్ గ్రూపుల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన పలు గ్రూపుల్లో బీజేపీ నా యకుడు ఎంఏ సమద్ ముస్లింలను కించపరుస్తూ ఇతర దేశాల్లో ప్రార్థనాయాలను టాయిలెట్లుగా, క్లబ్‌లుగా మారుస్తున్నారని, ఇస్లాం మతం ప్రమాదకరమని మేసేజ్‌లు పెట్టినట్లు తెలిపారు. ఈవిషయమై ముస్లిం కమిటీ అధ్యక్షుడు జంషీద్ ఆధ్వర్యంలో ముస్లింలు పోలీస్టేషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపి సమద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందజేశారు. ప్రశాంతంగా ఉన్న ఆత్మకూర్‌లో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మస్జిదేఆ జంజాహి, మస్జీదేసయదియ్య, మస్జీదేనూర్, యువకులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదాం



మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

ఆత్మకూర్/అమరచింత: పాలమూర్ ఎంపీగా గెలుపొందిన డీకే అరుణ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి చేసుకుందామని బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్, అమరచింత పట్టణాల్లో ఇంట్లో శనివారం బీజేపీ బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుపర్చేందుకు ఎంపీ డీకే అరుణ సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుతో పాటు చంద్రగఢ్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. అమరచింత మండల కేంద్రంలో ప్రభుత్వ కాలేజీ, గురుకుల పాఠశాల మంజూరుకు ప్రయత్నిస్తానని అరుణ భరోసా కల్పించారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మూత పడిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

మన్‌కీబాత్‌లో అందరూ పాల్గొనాలి

ప్రధాని నరేంద్రమోదీతో జరిగే మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ లెవల్‌లో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అమరచింత మండల రూరల్ అధ్యక్షుడు హరీష్, అనిల్‌గౌడ్, ఆత్మకూర్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అజిత్‌రెడ్డి, ఆనంద్, బాలకృష్ణ, బోరెల్లిరాము, సురేష్, రాజు, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, బీజేపీ జిల్లా నాయకులు నరాల నారాయణ, మరాఠి అశోక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, అనిల్ పాల్గొన్నారు.

డీఎస్ సేవలు మరువలేనివి



డీసీసీ కార్యాలయం వద్ద డి.శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం డీసీసీ కార్యాలయం ఎదుట డి. శ్రీనివాస్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ రాష్ట్ర ప్రజలకు నిత్యం ఎనలేని సేవ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కదిరె రాములు, నందిమల్ల యాదయ్య, కిరణ్‌కుమార్, కమ్మర్‌మియా, చెన్నరాములు, వెంకటేష్, రాగి వేణు, చీర్ల జనార్దన్, నారాయణ, పరశురాం, దివాకర్, రాములు, అబ్దుల్లా, భాస్కర్, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ధర్మపురి శ్రీనివాస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని స్థానిక నాయకులు అన్నారు. శనివారం యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాలపల్లి రామన్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, సత్యనారాయణ, శివసాయి, ఎండీ షకీల్, యుగంధర్‌రెడ్డి, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు రూరల్: పట్టణంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇంటి వద్ద మలిదశ ఉద్యమ నాయకుడు, గాయకుడు సాయిచంద్ ప్రథమ వర్ధంతిని బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తరఫున ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిన సమయంలో తన ఆట పాటలతో యువతను చైతన్యం చేశారని కొనియాడారు. తెలంగాణ ఉన్నంత వరకు సాయిచంద్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గట్టుయాదవ్, రమేష్‌గౌడ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్నయాదవ్, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, ఉంగ్లం తిర్మల్, మహేశ్వర్‌రెడ్డి, నీలస్వామి, స్టార్ రహీమ్, గిరి, రాము, ఎండీ గౌస్, జోహెబ్‌హుసేన్, మహిద్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



సమీక్షలో పాల్గొన్న ఏఎస్పీ రాందాస్ తేజావత్.. వివిధ శాఖల అధికారులు

వనపర్తి: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిద్దామని ఏఎస్పీ రాందాస్ తేజావత్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు కొనసాగే ఆపరేషన్ ముస్కాన్‌పై చైల్డ్ వెల్ఫేర్, లేబర్, ఎడ్యుకేషన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలతో పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, బాలల ఉజ్వల భవిష్యత్ నిర్మాణంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గొర్రెలు, పశువుల కాపరులుగా, మెకానిక్ దుకాణాలు, హోటళ్లలో చిన్నారులను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిఈడు చిన్నారులు పాఠశాలలకు వెళ్లకుండా పనులు చేస్తూ కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1098కుగాని, డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని.. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసే సమయంలో వంట ఏజెన్సీ వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఎస్‌ఎంఆర్‌సీ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు భోజనాన్ని తయారు చేసే సమయంలో పరిశుభ్రతను పాటించాలని, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందివ్వాలని ఆయన వంట ఏజెన్సీ సభ్యులకు తెలియజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలో సామర్థ్యాలను పెంపొందించేందుకు అవసరమైన హోంవర్క్‌తో పాటు సులభరీతిన విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు రాజన్నప్ప, రాధిక, శేఖర్, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



అమరచింత: సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ వలీ సూచించారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్ పరిసరాల్లో శనివారం సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం అంత ఇప్పుడు అరచేతిలోని సెల్‌ఫోన్‌లో ఉందని, టెక్నాలజీని మంచి పనులకు కాకుండా.. కొంత మంది అమాయకులను టార్గెట్ చేసి వారి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పరాదని, ఫోన్లకు మెస్సేజ్ రూపంలో వచ్చే తెలియని లింక్‌ను ఓపెన్ చేయరాదని సూచించారు.